# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



PM ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు
99086 89674 లో
సంప్రదించగలరు



హైదరాబాద్ | శుక్రవారం,మే30,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1




## పీఓకే ప్రజలు మనవాళ్లే, తిరిగి వస్తారు

- పీఓకే ప్రజలు మనవారే, భారత్‌తో బలమైన బంధాలున్నాయన్న రాజ్‌నాథ్ సింగ్
- పీఓకే త్వరలోనే రాజకీయంగా భారత్‌లో ఏకమవుతుందని ధీమా వ్యక్తం చేసిన రక్షణ మంత్రి
- "ఆపరేషన్ సిందూర్"తో మన దేశీయ వ్యవస్థల శక్తి ప్రపంచానికి తెలిసిందన్న వ్యాఖ్య
- దేశ రక్షణకు "మేకిన్ ఇండియా" కీలకమని రుజువైందని వెల్లడి

భౌగోళికంగా వేరుపడి ఉన్నప్పటికీ, పీఓకే ప్రజలు మనవారేనని, ఏదో ఒకరోజు రాజకీయంగా భారత్‌లో తప్పక ఏకమవుతారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదని, పీఓకే దానంతట అదే తిరిగి వస్తుందని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పీఓకే ప్రజలకు భారత్‌తో విడదీయరాని, దృఢమైన సంబంధాలున్నాయని ఆయన పునరుద్ఘాటించారు."గ్రేట్ ఇండియా నిర్మించాలన్నదే మా సంకల్పం. పీఓకేలో కొందరు మాత్రమే తప్పుదారి పట్టారు. మనం ఏదైనా చేయగలం, అయితే శక్తితో పాటు సంయమనం కూడా చాలా ముఖ్యం" అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.



## దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదు..


**ఇందిరమ్మ ధైర్యం మోదీలో లేదు...**

- ట్రంప్ బెదిరింపులకు మోదీ తలొగ్గారన్న రేవంత్ రెడ్డి
- పాక్‌తో యుద్ధం మధ్యలోనే ఎందుకు ఆపారంటూ నిలదీత
- ట్రంప్ కు భయపడి యుద్ధం ఆపారు...
- మోదీ కాలం చెల్లిన రూపాయి
- దేశ ఆత్మగౌరవాన్ని ట్రంప్ కాళ్ల దగ్గర పెట్టారంటూ ఆగ్రహం
- పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి తామ పూర్తిగా సహకరించాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మే29, ) ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి, పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ప్రధాని మోదీ అర్ధాంతరంగా నిలిపివేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ భద్రత విషయంలో ప్రధాని మోదీ తీరుపై పలు ప్రశ్నలు సంధించారు. గురువారం మేడ్చల్ నియోజకవర్గంలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జై హింద్ యాత్ర' అనంతరం నిజాంపేటలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు.

## పాకిస్థాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాం

- తల్లుల కన్నీటికి బదులు తీర్చుకున్నాం
- పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం
- సిక్కిం 50వ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో వర్చువల్‌గా ప్రధాని ప్రసంగం



పహల్గామ్ ఉగ్రదాడిని మానవత్వంపై జరిగిన ఘోరమైన దాడిగా అభివర్ణించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఈ దాడిలో తల్లుల సిందూరాన్ని దూరం చేసిన వారికి 'ఆపరేషన్ సిందూర్' రూపంలో గట్టి సమాధానం ఇచ్చామని స్పష్టం చేశారు. ఉగ్రవాదులు మన దేశాన్ని విభజించాలని చూశారని, మతం పేరుతో పాకిస్థాన్ విభజన రాజకీయాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. అయితే, భారతీయులంతా ఐక్యంగా నిలిచి వారి కుట్రలను తిప్పికొట్టారని, పాక్ వైమానిక స్థావరాలను కూడా ధ్వంసం చేశామని గుర్తు చేశారు.సిక్కిం రాష్ట్ర 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రసంగించారు. వాస్తవానికి ఆయన సిక్కింలో నేరుగా పర్యటించాల్సి ఉన్నప్పటికీ, వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ పర్యటన రద్దయింది. దీంతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిక్కిం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సిక్కింను ప్రపంచ పర్యాటక చిత్రపటంలో ఒక ముఖ్యమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. "సిక్కింను కేవలం భారతదేశానికే కాకుండా, యావత్ ప్రపంచానికి ఒక హరిత ఆదర్శ రాష్ట్రంగా (గ్రీన్ మోడల్ స్టేట్) అభివృద్ధి చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.వికసిత్ భారత్ నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ, పేదలు, రైతులు, మహిళలు, యువత అనే నాలుగు బలమైన మూలస్తంభాలపై ఇది రూపుదిద్దుకుంటోందని ప్రధాని వివరించారు.సిక్కిం రైతులు వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ఇది రాష్ట్రంలోని యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆపరేషన్ సిందూర్‌ను బీజేపీ రాజకీయం చేస్తోంది



- పశ్చిమ బెంగాల్ టీఎంసీ ప్రభుత్వం అవినీతిమయం, క్రూరమైనదన్న ప్రధాని మోదీ
- రాష్ట్రంలో హింస, అరాచకం, నిరుద్యోగం పెరిగాయని విమర్శ
- ప్రధాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ
- రేపు ఎన్నికలు నిర్వహించినా మేం రెడీ అంటూ ప్రధానికి సవాల్

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య మాటల తూటాలు పేలాయి. అలీపుర్‌దువార్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

ధాని ఆరోపణలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అంతే ఘాటుగా బదులిచ్చారు. ప్రధాని వ్యాఖ్యలు దిగ్భ్రాంతికి గురిచేశాయని, ఉగ్రవాదంపై దేశం ఐక్యంగా పోరాడుతున్న తరుణంలో, ఆపరేషన్ సిందూర్ వంటి సున్నితమైన అంశాలను బీజేపీ రాజకీయం చేయడం తగదని మండిపడ్డారు. ధైర్యముంటే రేపే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ప్రధానికి సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజలు తన వెంటే ఉన్నారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ముర్షిదాబాద్, మాల్దాలలో జరిగిన మత ఘర్షణలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇవి నిదర్శనమని మోదీ అన్నారు. బెంగాల్ అనేక సంక్షోభాలతో సతమతమవుతోందని, ఉపాధ్యాయ నియామక కుంభకోణం వేలాది కుటుంబాల భవిష్యత్తును నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారుప్రతి విషయంలోనూ న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. ఉగ్రవాదులకు సిందూరం శక్తిని చూపించామని, పాకిస్థాన్ ఉగ్రవాదానికి మాత్రమే ఆశ్రయం కల్పిస్తోందని ప్రధాని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో నిర్లక్ష్యం తగదు



- ఉమ్మడి వరంగల్ కలెక్టర్ల పనితీరుపై మంత్రి పొంగులేటి తీవ్ర అసంతృప్తి
- జూన్ 6 నాటికి లబ్ధిదారుల జాబితా, ప్రొసీడింగ్స్ కాపీలు సిద్ధం చేయాలని ఆదేశం
- నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచన

ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ల పనితీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రజలకు అత్యంత కీలకమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అనుమతుల మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యం తగదని అన్నారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని, జూన్ 6వ తేదీలోగా అర్హులైన వారి పూర్తి జాబితాను తయారు చేయాలని ఆయన గడువు విధించారు. కేవలం జాబితా మాత్రమే కాకుండా, సంబంధిత ప్రొసీడింగ్స్ కాపీలను కూడా జతచేసి అందించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.అదేవిధంగా, వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులను తీవ్రంగా నష్టపరిచే నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడదపై కూడా మంత్రి దృష్టి సారించారు.



## గిగ్ వర్కర్ల హక్కులకు కాంగ్రెస్ పెద్దపీట

- గిగ్ కార్మికులకు సామాజిక భద్రత, న్యాయమైన ఒప్పందాలకు ఆర్డినెన్స్ హామీ
- రాజస్థాన్, కర్ణాటక బాటలో తెలంగాణ కూడా నడుస్తుందన్న రాహుల్
- ప్రతి రాష్ట్రంలో కార్మికుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టీకరణా

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గిగ్ వర్కర్ల (ఆన్‌లైన్ వేదికల ద్వారా పనిచేసేవారు) హక్కులు, సంక్షేమంపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా గిగ్ కార్మికులు తనతో పంచుకున్న ఆవేదనను ఆయన గుర్తుచేసుకున్నారు. "మాకు రేటింగ్ కాదు, హక్కులు కావాలి. మేము మనుషులమే కానీ, బానిసలం కాదు" అని వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు తన మదిలో బలంగా నాటుకుపోయాయని రాహుల్ గాంధీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు.




## రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కడపలో ముగిసిన టీడీపీ మహానాడు
- ముగింపు సభలో చంద్రబాబు ప్రసంగం
- ఆర్థిక ఉగ్రవాదులపై 'ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్' కు పిలుపు
- కడప మహానాడు వేదికగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు

పాకిస్థాన్ ఉగ్రవాదులను ఏరిపారేసిన 'ఆపరేషన్ సింధూర్' తరహాలో రాష్ట్రంలో 'ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్' చేపట్టి, ఆర్థిక ఉగ్రవాదులను రాజకీయాల నుంచి తరిమికొట్టాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చారు. ఉగ్రవాదులు దేశానికి ఎంత ప్రమాదకరమో, రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక నేరగాళ్లు సమాజానికి అంతకంటే ఎక్కువ హానికరమని ఆయన అన్నారు. కడప శివార్లలో గురువారం జరిగిన మహానాడు మూడో రోజు బహిరంగ సభలో ఆయన పార్టీ శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

# క్షయ (టీబీ) వ్యాధిపై అవగాహన కార్యక్రమం



పెన్ పహాడ్/ ప్రజా ముచ్చట, మే 29:మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి సూచనల మేరకు మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో నిక్షయ్ శివిర్-2 క్యాంపు నిర్వహించి క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి సంక్రమించు విధానం, నివారణ చర్యలు, వ్యాధి వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు . ఈ క్యాంపు లో 31 మంది నుండి స్పుటము(తెమడ నమూనాలను) నమూనాలను సేకరించి సి బి నాట్ ల్యాబ్ కు పంపడం జరిగిందనీ తెలిపారు. అదేవిధంగా 63 మందికి ఎక్రే పరీక్షలు చేయడం జరిగిందని అన్నారు ఈ ఎక్రే మరియు తెమడ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెన్ పహాడ్ పరిధిలో ఉచితంగా మందులు ఇవ్వబడును అని తెలిపారు. మందులు క్రమం తప్పకుండా వేసుకున్నచో ఆరు నెలల్లోనే వ్యాధి నయమగునని , నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ముదిరి 18 నెలల చికిత్స అవసరం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ భూతరాజు శ్రీనివాసులు, ఎంపీహెచ్ఎస్ భూతరాజు సైదులు, ఎల్ టి లింగాల రాజు, ఎస్ టి ఎస్ ప్రిన్సి, ఎస్ టి ఎల్ ఎస్ వెంకన్న, డి ఆర్ టి బీ ప్రసాద్, డీఈవో మాధవరెడ్డి, ఎంపీహెచ్ఏ మధు, ఏఎన్ఎం దుర్గ, ఆశాలు లలిత, రాధ, షేక్ జహాంగీర్ బేగం, సవిత, గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభం



పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 29:జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ అధికారి బి. అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అనంతారం సొసైటీలో గురువారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీ జీలుగు విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడని సాధించాలని కోరారు. విత్తనాలను పంట పొలంలో వేసిన 45 రోజులకు భూమిని కలియ దున్నడంతో ఆ భూమి సారవంతంగా మారి పంట దిగుబడులు పెరుగుతాయి అని అన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పొలం పాస్ బుక్, ఆధార్ జిరాక్స్ తో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి శ్రావణి, సొసైటీ సిబ్బంది మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జీలుగ సాగు చేయండి
# - భూసారం, పంటదిగుబడి పెంచండి

**- వ్యవసాయాదికారి బి. కళ్యాణ్ చక్రవర్తి**



పాలకవీడు/ప్రజా ముచ్చట, మే 29:రైతులు జీలుగ సాగు చేసి దుక్కిలో కలిపి దున్నడం వలన భూసారం పెరిగి పంటలు సమృద్ధిగా పండి అధిక దిగుబడి వస్తుంది అని మండల వ్యవసాయశాఖ అధికారి బి. కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.గురువారం ఆయన మీడియాతోమాట్లాడారు.వ్యవసాయశాఖ తరపున ఈ వానాకాలం సీజన్ కు సంబంధించిమండలకేంద్రములోని ప్రాదమికవ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్టపైరు విత్తనాలు అయినటువంటి జీలుగ విత్తనాలను సబ్సిడిపై పంపిణిచేయడంజరుగుతుందని,18 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి అని, 30 కేజీల జీలుగ విత్తనాల బస్తా పూర్తి ధర 4275 రూపాయలు కాగా ప్రభుత్వ సబ్సిడీ 50 శాతం రాయితీ పోను రైతు మిగిలిన 50 శాతం నగదు అనగా 2137.50 రూపాయలు చెల్లించాలని అన్నారు. మండలంలో జీలుగు విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని సొసైటీ కి వెళ్లి తీసుకోవాల్సిందిగా వారు తెలిపారు . పచ్చిరొట్ట జీలుగ (పచ్చిరొట్టపైర్ల)ఉపయోగాలను వివరిస్తూ ఇవి భూమికి సేంద్రియ పోషకాలను అందిస్తుందని, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను అందిస్తుందని పేర్కొన్నారు.అంతేకాకుండా, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుందని, పచ్చిరొట్ట జీలుగను పొలంలో వేసి కలియ దున్నడం వలన భూమి సారవంతం అవుతుందని అన్నారు. దీనివల్ల భూమి సారం పెరిగి దిగుబడులుపెరుగుతాయన్నారు.ఇది పంటలకుఅవసరమైన పోషకాలను అందిస్తుంది. జీలుగ మొక్కలు నత్రజనిని శోషించుకుంటాయి. మరియు వాటి వేర్ల ద్వారా నత్రజనిని నేలకి అందిస్తాయి. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# వికసించిన మే పుష్పం

ఖమ్మం రూరల్/ప్రజా ముచ్చట, మే 29:సంవత్సరంలో ఒకసారి మాత్రమే పూసే అరుదైన మే పుష్పం వికసించింది. ఏదులాపురం ధరణి నగర్ లోని వలపర్ల షీల కిరణ్ కుమార్ ఇంటి గార్డెన్ లో గురువారం మే పుష్పం విరబూసి అందరినీ ఆకట్టుకుంటుంది. ఇది దుంప రకం మొక్క అని, మే నెలలో పూసిన



పుష్పాలు జూన్ వరకు ఉండి ఎండిపోతాయని షీల చెబుతున్నారు. అరుదుగా పుష్పించే ఈ మొక్కను చుట్టుపక్కల వారు, పరిచయస్తులు వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు. వివిధ రకాల పూల చెట్లను పెంచడం తమకు ఇష్టమని ఆ దంపతులు తెలిపారు.

# యూపీలో భారీ ఎన్‌కౌంటర్.. లారెన్స్ బిష్ణోయ్ ముఠా షార్ప్ షూటర్ నవీన్ హతం

**- యూపీ టాస్క్‌ఫోర్స్, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్**
**- నవీన్‌పై హత్య, దోపిడీ సహా 20కి పైగా క్రిమినల్ కేసులు**
**- పోలీసులపై కాల్పులు జరిపి పారిపోయే క్రమంలో మృతి**




ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఓ పోలీసు ఎన్‌కౌంటర్‌లో లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన కీలక సభ్యుడు, షార్ప్ షూటర్ నవీన్‌కుమార్ ప్రాణాలు కోల్పోయాడు. అతడిపై హత్యలు, దోపిడీలు సహా 20కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో మరోసారి లారెన్స్ బిష్ణోయ్ ముఠా కార్యకలాపాలు చర్చనీయాంశమయ్యాయి.వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని హాపుర్ ప్రాంతంలో యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్), ఢిల్లీ పోలీసులు గురువారం సంయుక్తంగా ఒక ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్ జరుగుతుండగా లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడు నవీన్‌కుమార్ అక్కడికి చేరుకున్నాడు. పోలీసులను గమనించిన వెంటనే వారిపై కాల్పులకు తెగబడ్డాడని, అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పారిపోవడానికి విఫలయత్నం చేశాడని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరపగా నవీన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారుమరణించిన నవీన్‌కుమార్‌ను ఘజియాబాద్ జిల్లా పరిధిలోని 'లోని' ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠాలో నవీన్‌కుమార్ షార్ప్ షూటర్‌గా చురుగ్గా వ్యవహరిస్తున్నాడని, ముఠాలోని మరో కీలక సభ్యుడు హాషీం బాబాతో కలిసి పలు నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అతడపై హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, దోపిడీ వంటి తీవ్రమైన నేరాలకు సంబంధించి సుమారు 20 కేసులు నమోదై ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.లారెన్స్ బిష్ణోయ్ ముఠా గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా పలు నేర కార్యకలాపాలతో వార్తల్లో నిలుస్తోంది. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు ఈ ముఠా నుంచి అనేకసార్లు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా, సల్మాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీని కూడా ఈ ముఠా సభ్యులే దారుణంగా హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం లారెన్స్ బిష్ణోయ్ జైల్లో ఉన్నప్పటికీ, అక్కడి నుంచే సెల్‌ఫోన్ల ద్వారా తన అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ నేరాలకు, హత్యలకు ప్రణాళికలు రచిస్తున్నాడనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నవీన్‌కుమార్ ఎన్‌కౌంటర్ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# గతంలో సర్జికల్ స్ట్రైక్స్‌పై శశిథరూర్ వ్యాఖ్యలు: కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా చురక

**- మోదీ సర్కార్ అనుకూల వ్యాఖ్యలతో వార్తల్లో శశి థరూర్**
**- శశి థరూర్ తీరుపై కాంగ్రెస్‌లో అసంతృప్తి**
**- గతంలో బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించిన థరూర్ పుస్తక భాగం షేర్ చేసిన పవన్ ఖేడా**
**- సర్జికల్ స్ట్రైక్స్‌ను రాజకీయాలకు వాడుకున్నారన్న థరూర్ పాత వ్యాఖ్యలు**
**- థరూర్ వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానంటూ పవన్ ఖేడా చురక**




కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శశి థరూర్ ఇటీవల మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా కొన్ని వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సొంత పార్టీ నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో సీనియర్ నాయకుడు పవన్ ఖేడా గతంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని విమర్శిస్తూ శశి థరూర్ రాసిన పుస్తకంలోని కొన్ని కీలక వాక్యాలను గుర్తుచేశారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్‌పై థరూర్ తన పుస్తకంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లు పవన్ ఖేడా 'ఎక్స్' వేదికగా చురక అంటించారు.పవన్ ఖేడా షేర్ చేసిన ఫొటోలో శశి థరూర్ గతంలో రాసిన పుస్తకంలోని పేరా ఉంది. అందులో "2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌ను పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు. అంతకుముందు మయన్మార్‌లో తిరుగుబాటుదారులపై జరిగిన సైనిక చర్యను కూడా ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకున్నారు. నిజానికి కాంగ్రెస్ పార్టీకి ఇలాంటివి చేసే అవకాశం ఉన్నప్పటికీ ఎప్పుడూ అలాంటి పనులు చేయలేదు" అని శశి థరూర్ విమర్శించినట్లు ఉంది.ఈ పేరా ఫొటోను షేర్ చేస్తూ "ప్రస్తుతం నేను ఈ పుస్తకం చదువుతున్నాను. శశి థరూర్ గారూ మీరు చేసిన ఈ వ్యాఖ్యలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను" అని పవన్ ఖేడా తన పోస్టులో రాసుకొచ్చారు.ఇటీవల పనామాలో జరిగిన ఓ విలేకరుల సమావేశంలో శశి థరూర్ మాట్లాడుతూ 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్‌తోనే భారత్ తొలిసారిగా పాకిస్థాన్ భూభాగంలోకి ప్రవేశించిందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు థరూర్‌పై ఆగ్రహం కూడా వ్యక్తం చేసింది. అయితే తాను కేవలం ప్రస్తుత ఉగ్రదాడుల గురించి మాత్రమే మాట్లాడానని గతంలో జరిగిన యుద్ధాల గురించి ప్రస్తావించలేదని శశి థరూర్ వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పవన్ ఖేడా తాజాగా చేసిన పోస్ట్ ద్వారా గతంలో థరూర్ చేసిన విమర్శలను తెరపైకి తెచ్చారు.

# రక్షణ కొనుగోళ్ల జాప్యంపై ఎయిర్ చీఫ్ మార్షల్ తీవ్ర ఆందోళన..

దేశ రక్షణ రంగంలో కీలకమైన సేకరణ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాకపోవడంపై భారత వైమానిక దళ ప్రధానాధికారి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్వదేశీ పరిజ్ఞానంతో చేపడుతున్న ప్రాజెక్టులు ఆలస్యం అవుతుండటం పట్ల ఆయన అసంతృప్తి వెలిబుచ్చారు. "చాలాసార్లు, కాంట్రాక్టులపై సంతకాలు చేసేటప్పుడే ఆ వ్యవస్థలు ఎప్పటికీ మన చేతికి రావని మాకు తెలుస్తుంది. కాలపరిమితులు పెద్ద సమస్య. ఒక్క ప్రాజెక్టు కూడా సమయానికి పూర్తయినట్లు నాకు గుర్తులేదు. సాధించలేని దాని గురించి మనం ఎందుకు వాగ్దానం చేయాలి?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ ఎంకే1ఏ కార్యక్రమాన్ని ఉదాహరణగా చూపుతూ, 2021 ఫిబ్రవరిలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో రూ. 48,000 కోట్ల విలువైన ఒప్పందం కుదిరినప్పటికీ, ఆర్డర్ చేసిన 83 విమానాల్లో ఒక్కటి కూడా ఇప్పటివరకు అందలేదని ఆయన తెలిపారు. వాస్తవానికి, వీటి డెలివరీ 2024 మార్చిలోనే ప్రారంభం కావాల్సి ఉంది. "తేజస్ ఎంకే1 డెలివరీలు ఆలస్యమయ్యాయి. తేజస్ ఎంకే2 నమూనా ఇంకా బయటకు రాలేదు. 'అమ్కా' స్టెల్త్ యుద్ధ విమానానికి సంబంధించి కూడా ఇంకా నమూనా సిద్ధం కాలేదు" అని ఎయిర్ చీఫ్ మార్షల్ వివరించారు."మనం కేవలం భారత్‌లో తయారు చేయడం గురించే కాదు. డిజైనింగ్ గురించి కూడా మాట్లాడాలి. దళాలకు, పరిశ్రమలకు మధ్య నమ్మకం ఉండాలి. మనం చాలా పారదర్శకంగా ఉండాలి. ఒకసారి దేనికైనా కట్టుబడితే, దాన్ని అందించాలి. మేక్ ఇన్ ఇండియా కోసం వాయుసేన తన వంతు కృషి చేస్తోంది" అని ఆయన అన్నారు. "భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలంటే, మనం వర్తమానానికి కూడా సిద్ధంగా ఉండాలి. పదేళ్లలో పరిశ్రమల నుంచి మనకు ఎక్కువ ఉత్పత్తి రావచ్చు. కానీ ఈ రోజు మనకు అవసరమైనవి ఈ రోజే కావాలి. మనం తక్షణమే కార్యాచరణను వేగవంతం చేయాలి. మన దళాలను శక్తిమంతం చేయడం ద్వారానే యుద్ధాల్లో గెలుస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.సీఐఐ వార్షిక వాణిజ్య సదస్సులో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొన్న కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, "'ఆపరేషన్ సిందూర్' అనేది దేశానికి దక్కిన గొప్ప విజయం. దీనిని అత్యంత ప్రణాళికాబద్ధంగా, వృత్తి నైపుణ్యంతో అమలు చేశాం. మేము సత్య మార్గంలో నడిచాం. అందుకే దైవం కూడా మాకు అండగా నిలిచాడని నేను నమ్ముతున్నాను" అని తెలిపారు.ఈ కచ్చితమైన దాడుల ద్వారా భవిష్యత్ రక్షణ అవసరాలు, వ్యూహాలపై భారత్‌కు స్పష్టమైన అవగాహన ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. "యుద్ధ స్వరూపం నిరంతరం మారుతోంది.

# లాభాలు దండుకుంటున్న కంపెనీలు .. పాడెక్కుతున్న కౌలు రైతులు

బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెంలో కౌలు రైతు ఆత్మహత్య! ముప్పాళ్ళ మండలంలో కౌలు రైతు ఆత్మహత్య! ఇంకొల్లు మండలంలో కౌలు రైతు ఆత్మహత్యాయత్నం! ఎందుకిలా జరుగుతున్నది?సుమారు 90 నుండి 150 రోజులు కష్టపడి ఆటుపోట్లను తట్టుకొని పొగాకు పంట సాగు చేశారు. పంట వేయక ముందు వివిధ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో రైతాంగం చుట్టూ తిరిగి 'నల్ల బర్లీ వేయండి. గత సంవత్సరం రేటు ఇంకా రెండు మూడు సంవత్సరాలు ఉంటుంది' అని ప్రోత్సహించారు. ఫలితంగా పొగాకుతో పాటు ఇతర పంటలు వేసే రైతులు అన్నీ వదులుకొని నల్ల బర్లీ పొగాకు ఒక్కటే సాగు చేశారు. గత సంవత్సరం రేటు సంగతి పైవాడికెరుక. ఇప్పుడు ఎంతో కొంతకు కొనే నాథుడు కూడా లేడు. పైగా సంవత్సరం అంతా ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు, ఎరువులు, పురుగు మందుల షాపుల నుంచి అరువు తెచ్చిన రైతులు, కౌలు రైతులు చివరకు కూలీలకు డబ్బులు ఇవ్వలేకపోతున్నారు. భార్య మెడలో బంగారాన్ని తాకట్టు పెట్టినా సరిపోక అప్పుల వారికి మొహం చూపించలేకపోతున్నారు. కనీసం అడుగు ఆకు అమ్మయినా కూలి డబ్బులు తీరుద్దామంటే అది కూడా దారుణంగా ఉంది. అడుగు ఆకు కోస్తే క్వింటాకి రూ.5000 కూలి అయింది. ఆ అడుగు ఆకుని కంపెనీకి అమ్ముకుంటే కేవలం రూ.2500 వచ్చిందంటే పంట పండించడానికి అయిన ఖర్చు, కూలి కలిపి రాకపోయినా%ౌ%కూలీలకైన ఖర్చన్నా రాకపోగా అందులో సగం డబ్బ మాత్రమే వచ్చింది. వీటన్నింటి వలన ప్రత్యేకించి కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.నేడు రైతులు కేజీ పొగాకును 30 రూపాయల నుండి 100 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఆ కేజీ పొగాకుతో కనీసం 1250 నుండి 2000 సిగరెట్ల వరకూ తయారవుతాయి. అంటే ఒక్కొక్క సిగరెట్టుకు 0.7 గ్రాముల నుండి ఒక గ్రాము వరకు పొగాకు వాడతారు. ఈ క్రమంలో కొంత వృధా అయినా తక్కువలో తక్కువగా సగటున 1250 సిగరెట్లు వస్తాయి. ఒక్కొక్క సిగరెట్టు సగటు ధర రూ.10



అనుకున్నా కేజీ పొగాకు ద్వారా ఉత్పత్తి అయిన 1250 సిగరెట్లను అమ్ముకుంటే కంపెనీకి రూ.12,500 వస్తాయి. రైతులకు పొగాకు కోసం రూ.30 నుండి రూ.100 పోతాయి. అంటే ఒక కేజీ పొగాకు ద్వారా రూ.12,400 ఆదాయం కంపెనీకి వస్తుంది. ఒక ఎకరాకు 12 నుండి 13 క్వింటాళ్ళు పొగాకు పండిస్తున్నారు. అంటే క్వింటా రూ.10,000 చొప్పున 12 క్వింటాళ్లు కొన్నారనుకుంటే రైతులకు రూ.1,20,000 వస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష 50 వేలు అయ్యింది. దాంతో రైతుకు ప్రతి ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేలు నష్టం వస్తుంది. అదే కంపెనీకి కేజీ పొగాకుతో చేసిన 1250 సిగరెట్లు అమ్ముకోవడం ద్వారా రూ.12,400 వస్తుంది. ఎకరా పొగాకు ద్వారా కంపెనీకి రూ.12 లక్షల 40 వేల ఆదాయం వస్తుంది. ఈ అంకెలు కొంచెం నమ్మడానికి కష్టంగా ఉంటుంది. కానీ ఐటిసి కంపెనీ అనేక వ్యాపారాలు చేస్తుంది. ఇంటర్నెట్‌లో లభించిన సమాచారం మేరకు 2024 సంవత్సరంలో కంపెనీ రూ.20 వేల 751 కోట్ల నికర లాభం పొందింది. ఆ కంపెనీకి రూ.91,826 కోట్ల విలువ గలిగిన స్థిరాస్తులున్నాయి. ఐటిసి కంపెనీ సీఈఓ జీతం నెలకు రూ.రెండు కోట్ల పైనే. అంటే గంటకు రూ.10 లక్షలు జీతం. మన రైతు సంవత్సరం అంతా ఎండనకా వాననకా ఆరుగాలం కష్టపడి పనిచేసనా%ౌ%ఆయన గంట జీతం అంత కూడా సంపాదించలేకపోతున్నాడు.క్యాడ్బరీ పరిస్థితి కూడా అలాగే వుంది. నేడు అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలు కేజీ రూ.800 నుంచి రూ.900 రూపాయలు తక్కువ కాకుండా కొంటున్నారు. కానీ మన రాష్ట్రంలో మాండలిస్ కంపెనీ ఈ కోకో గింజలను కేవలం 450 రూపాయలకే కొంటున్నది. ఒక కేజీ కోకో గింజల నుంచి 800 గ్రాముల కోకో నిబ్స్ వస్తాయి. 400 నుండి 500 గ్రాముల కోకో లిక్విడ్ వస్తుంది. వంద గ్రాముల కోకో చాక్లెట్‌లో 70 గ్రాముల కోకో పదార్థాలుంటాయి. వంద గ్రాములు కోకో లిక్విడ్‌తో పది చాక్లెట్లు వస్తాయి. అలాగే మిల్క్ షేక్ అయితే 12 నుంచి 16 ముక్కలు వస్తాయి. చాక్లెట్లు ఒక కేజీకి సుమారుగా 150 ముక్కలు వస్తాయి. అంటే తక్కువలో తక్కువ కంపెనీకి రూ.16 వేలు వస్తాయి. కానీ రైతుకి ఇస్తున్నది కేజీకి రూ.450 మాత్రమే. అంటే రైతుకిచ్చిన దానికి అదనంగా 40 రెట్లు లాభం కంపెనీకి వస్తుంది. మాండలిస్ కంపెనీ 2022-2023లో రూ.1176 కోట్ల నికర లాభం పొందగా, 2023-2024లో రూ.2020 కోట్ల నికర లాభాలు సంపాదించింది. ఆ కంపెనీ కూడా రూ.5.76 లక్షల కోట్ల విలువ కలిగిన ఆస్తులున్నాయి. ఈ కంపెనీ షేర్ విలువ కూడా 64.14 డాలర్లకు పెరిగింది. ఈ మధ్య కాలంలో చాక్లెట్ల ధర 22 శాతం నుండి 30 శాతం వరకు పెంచారు. క్యాడ్బరీ కంపెనీ ఎమ్.డి స్థాయి అధికారుల జీతాలు నెలకు రూ.64 లక్షల నుండి రూ.96 లక్షల మధ్యలో ఉన్నాయి. అలాగే ఇతర ఉన్నతాధికారులు జీతాలు కూడా లక్షల్లో ఉన్నాయి. కానీ ఈ కంపెనీల లాభాలకు, స్థిరాస్తులకు, ఉన్నతాధికారుల జీతాలకు ముడి పదార్థమే మూలం. ఆ ముడి పదార్థం లేకపోతే కంపెనీ లేదు. లాభాలు లేవు. ఆస్తులు కూడా ఉండవు. కానీ ఆ ముడి పదార్థం పండించే రైతులు, కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. వున్న కొద్దో గొప్పో ఆస్తులను కూడా అమ్ముకుంటున్నారు. చివరకు ఆత్మాభిమానంతో అప్పుల వారికి మొహం చూపించలేక అప్పులు తలుచుకుంటూ ఆప్తులను, భార్యాబిడ్డలను కూడా వదులుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. కంపెనీలు లాభాలతో కోట్లకు పడగలెత్తుతుంటే, పొగాకు సాగు చేసిన కౌలు రైతులు చివరకు ఆత్మహత్య చేసుకుని పాడెక్కుతున్నారు. డబ్బు కంటే విలువైనది ప్రాణం. ఆ విలువైన ప్రాణాన్ని రైతాంగం బలవంతంగా తీసుకుంటున్నారంటే ప్రభుత్వం, ప్రజలు, సభ్యసమాజం ఆలోచించాలి. మీటింగ్‌కి వెళ్తున్నారా అని వెటకారంగా పలకరించటం, మంత్రిగారి దగ్గరికి వెళ్తున్నారా, కొనుగోలు ఇంకా ఆలస్యం అవుతుందని హెచ్చరించడం, ధర్నా చేస్తున్నారా ధర ఇంకా పడిపోతుందని బ్లాక్ మెయిల్ చేయడం%ౌ%.ఇదీ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో చేసే ప్రచారం. వాస్తవంగా పొగాకు వేయమని ప్రజల్లో ప్రచారం చేసి, నమ్మించి మోసం చేసినందుకు ఈ కంపెనీ ప్రతినిధుల మీద ఐపిసి సెక్షన్ 426 కేసు పెట్టాలి. ఇప్పటికీ వ్యవసాయ శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీల ప్రతినిధులు పలు దఫాలు చర్చించారు. అయినా కొనుగోలు వేగవంతం కాలేదు. మంత్రులు చర్చల తర్వాత కూడా కంపెనీలు కొనుగోళ్లు చేయటం లేదు. అంటే ప్రభుత్వ పాత్రని అనుమానించాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో%ౌ%పొగాకు సాగుదారులందరూ ఐక్యంగా పోరాడితేనే పంటకు గత సంవత్సరం ధర సాధించగలుగుతారు.

# అమానుషం




చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ అడవుల్లో బుధవారంనాటి మావోయిస్టుల భారీ 'ఎన్‌కౌంటర్' రాజ్యహింసకు ప్రతిరూపం. మావోయిస్టు పార్టీ పలుమార్లు చర్చలను అభ్యర్థిస్తూ చేసిన ప్రతిపాదనలను అటు కేంద్రం ఇటు చత్తీస్‌గఢ్ బిజెపి ప్రభుత్వాలు వినిపించుకోకుండా మావోయిస్టులను భౌతికంగా అంతమొందించేందుకు తెగబడటం ప్రజాస్వామ్యంలో ఆమోదించరాని చర్య. ఈ అమానుష హత్యాకాండను తమ ఘనతగా ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా సమర్థించుకొని, మావోయిజం నిర్మూలనలో ఒక మైలురాయిగా అభివర్ణించి, పోలీస్, భద్రతా బలగాలను అభినందించి మనుషుల ప్రాణాలు తీయడాన్ని కూడా సెలబ్రేట్ చేసుకోవడం అమానుషం. ఎంతటి జఠిల సమస్యలనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చన్న అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాన్ని మోడీ ప్రభుత్వం నిరాకరించి తనలోని అమానవీతను బయటపెట్టుకుంది. మావోయిస్టుల చర్చల విజ్ఞప్తులపై అంగీకరించాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరులు చేసిన వినతిని పెడచెవినపెట్టి అమిత్‌షా, చత్తీస్‌గఢ్ సిఎం చర్చలు జరపబోమని ప్రకటించి హత్యలు, విధ్వంసం, వినాశనాలను ఎంచుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధంవచ్చే మార్చి కల్లా దేశంలో మావోయిజాన్ని నిర్మూలిస్తామని అమిత్‌షా పదే పదే డెడ్‌లైన్‌ను గుర్తు చేస్తుండగా, అందుకుతగ్గట్టు చత్తీస్‌గఢ్, ఇతర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు భద్రతా బలగాల విస్తృత గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్లతో నిత్యం నెత్తురోడుతున్నాయి. నారాయణపూర్, బస్తర్, దంతెవాడ అడవుల్లో కేంద్రం, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు యుద్ధం ప్రకటించాయి. మావోయిస్టుల పేరిట అమాయక ఆదివాసీలపై దాడులు, అక్రమ నిర్బంధాలు పౌర, మానవ, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాయబడుతున్నాయి. ఈ అక్రమ అణచివేత చర్యల్లో వేలాది మంది చనిపోయారని స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి. ఇటీవలి కాలంలో మోడీ ప్రభుత్వం దండకారణ్యం టార్గెట్‌గా వేలాది మంది సాయుధ దళాలతో జల్లెడ పడుతోంది. బేస్‌క్యాంప్‌లు, ఫార్వర్డ్ ఆపరేటింగ్ స్థావరాలు, నిఘా సమాచార సేకరణ డ్రోన్లు, శాటిలైట్ మ్యాపింగ్, సైనిక హెలికాప్టర్లు, మావోయిస్టుల ప్రాబల్యంలోని ప్రాంతాల స్వాధీనం, ప్రత్యేక పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటివి జరుగుతున్నాయి. ఈ వ్యవహారం పరాయి దేశంపై దండెత్తిన మాదిరి. దీనిలో భాగమే మే 19న చేపట్టిన ఆపరేషన్ కగార్. ఈ ఎన్‌కౌంటర్‌లోనే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మందిని కడతేర్చారు.మోడీ ప్రభుత్వం తలకెత్తుకున్న 'మావోయిస్టు ముక్త భారత్' వెనుక అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్ల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. విలువైన ఖనిజ, ప్రకృతి సహజ వనరులు మన అడవులకు ప్రత్యేకం. వాటిపై ఎప్పటి నుంచో కార్పొరేట్లు కన్నేశారు. ఆ వనరులను కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం తహతహలాడుతోంది. పర్యావరణాన్ని కూడా లెక్క చేయకుండా చెట్ల నరికివేత, పవర్ ప్రాజెక్టులు, భారీ మైనింగ్‌లకు అనుమతులిస్తోంది. గిరిజనులను అడవుల నుంచి వెళ్లగొట్టే దుర్మార్గానికి ఒడిగట్టింది. చివరికి రాజ్యాంగాన్ని, ఆదివాసీలకు కల్పించిన హక్కులను, వారికి రక్షణగా ఉన్న చట్టాలను నీరుగారుస్తోంది. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ గిరిజనుల గెంటివేతకు మావోయిస్టు బూచి చూపిస్తోంది. బతుకు పోరాటం చేస్తున్న స్థానిక గిరిజనుల ఉద్యమాలను ఉక్కుపాదంతో నలిపేస్తోంది. ఎన్‌కౌంటర్ అంటే ఎదురుకాల్పులు అన్న అర్థాన్ని మార్చేసింది. ముందుగా పట్టుకొని కాల్చిచంపడమే ఎన్‌కౌంటర్ అనే నిర్వచనాన్ని స్థిరపర్చింది. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ డిమాండ్ సహేతుకమైనది. మావోయిస్టుల రాజకీయాలను అంగీకరించకపోవచ్చు. హింస ఎటువైపు జరిగినా ప్రజాస్వామ్యంలో ఆమోదం కాదు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్య హింసకు అనుమతి ఉండదు. మావోయిస్టుల సమస్య శాంతి భద్రతలకే పరిమితం కాదు. ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణంలో చూడాలి. అన్ని రకాల పారా మిలిటరీ చర్యలను నిలిపేసి మావోయిస్టులతో మోడీ ప్రభుత్వం చర్చలు జరపాలి. ఎన్‌కౌంటర్లో మరణించిన వారి మృతదేహాలను ఇవ్వడానికి తాత్సారం చేయడం సరికాదు. వెంటనే బంధువులకు అప్పగించాలి. ప్రజాస్వామిక వాతావరణం కోసం ప్రజాతంత్ర ఉద్యమం నెరపాల్సిన సమయమిది.

# దేశ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకుందాం

పహల్గాంలో ఉగ్రవాదుల అమానుష దాడి జరిగి నెల రోజులైంది. ఉగ్రవాదంపై యుద్ధంతో ప్రారంభమై, కాల్పుల విరమణతో ముగిసిన పరిణామాలు దేశ సమైక్యతకు, సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా మారాయి. దేశ భద్రతకు సవాలుగా మారిన ఉగ్రవాదాన్ని గట్టిగా అరికట్టాలని ప్రతి భారతీయుడు కోరుకున్నాడు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను బలపరిచారు. ఉగ్ర దాడికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా సమైక్యతా భావం వెల్లివిరిసింది. అయితే అమెరికా ఆదేశాలతో జరిగిన కాల్పుల విరమణ, తదనంతర సంఘటనలు ఇన్నేళ్ళుగా మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయి. యుద్ధోన్మాదంతో రెచ్చిపోయిన మూకలు అధికారుల మీద, వారి కుటుంబ సభ్యుల మీద చేస్తున్న ట్రోలింగ్ దాడులు సైమక్యతకు సవాళ్ళు విసురుతున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రధాని మౌన మునిగా మారిపోవడం మరింత ఆందోళనకరం. పాలక అనుచర మీడియా రోత పుట్టేలా మోత మోగించినా వాస్తవాలను గ్రహించిన నెటిజన్లు అన్ని వైపుల నుండి వదులుతున్న ప్రశ్నల శరాఘాతాలకు కేంద్ర పాలకులు, వారి అనుయాయులు తల్లడిల్లుతున్నారు. తాము పెంచి పోషించిన సోషల్ మీడియా తమకే భస్మాసుర హస్తంగా మారుతుండడంతో బెంబేలెత్తుతున్నారు. ట్రంప్ ఆలింగనం ధృతరాష్ట్ర కౌగిలిగా మారుతుండంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్నారు.ఉగ్ర దాడి %-% కాల్పుల విరమణకాశ్మీర్ లోని పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు 26 మందిని బలిగొన్నారు. 16 మంది అక్కడికక్కడే చనిపోగా పది మంది ఆసుపత్రికి తరలిస్తున్నప్పుడు, చికిత్స పొందుతున్నప్పుడు మరణించారు. ఇందులో ఒకరు నేపాలీ కాగా మిగిలినవారు భారతీయులు. కాల్పుల సమయంలో ఉగ్రవాదులను ఎదిరించి వీర మరణం పొందిన సయ్యద్ హుస్సేన్ కాశ్మీర్ స్థానికుడు కాగా, మిగిలిన వారు సుందర కాశ్మీరాన్ని సందర్శించడానికి వచ్చిన యాత్రికులు. దాడి జరిగిన వెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి జమ్ముకాశ్మీర్‌కు వెళ్లగా, సౌదీ అరేబియా పర్యటనలో వున్న ప్రధాని పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని వచ్చారు. ఉగ్రవాద దాడి వెనుక పాకిస్తాన్ హస్తం వుందని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మరుసటి రోజు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశం జరిపి కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని తక్షణం తాత్కాలిక నిలుపుదల చేసి, కిందకు నీటి పారుదలను నిలిపివేసింది. అట్టారీ-వాఘా సరిహద్దు మూసివేసింది. గతంలో పాకిస్తానీయులకు జారీ చేసిన ప్రత్యేక వీసాలను రద్దు చేసింది. వారంతా 48 గంటల్లో దేశం విడిచి వెళ్ళాలని, ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నేవీ, వైమానిక సలహాదారులు వారం రోజుల్లో దేశం విడిచిపోవాలని ఆదేశించింది. ఇంత తీవ్రంగా ప్రభుత్వం స్పందించిన మరుసటి రోజు అంటే ఏప్రిల్ 24న రాజకీయ పార్టీల సమావేశం వేశారు. అందులో ప్రధాని పాల్గొనకుండా బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్ళి మొట్టమొదటిసారి ఇంగ్లీషులో ఉపన్యసించారు. "పహల్గాం ఉగ్ర దాడి వెనుక వున్నవారిని, కుట్రలో భాగమైన వారిని ఊహకందని రీతిలో శిక్షిస్తాం, ప్రతి ఉగ్రవాదిని గుర్తించి శిక్షిస్తామని భారతీయులకు హామీ ఇస్తున్నా"నని ఆ సభలో ప్రకటించారు. కాశ్మీర్‌లోని ఉగ్రవాద ఇళ్ళుగా ఎంపిక చేసిన వాటిని ఏప్రిల్ 28న కూల్చి వేసి, సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ఏప్రిల్ 29న ప్రధాని ప్రకటించారు.ఈ పరిణామాల నేపథ్యంలో బిజెపి భజన బృందం అటు సోషల్ మీడియా, ఇటు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో ఎంత రెచ్చగొట్టాలో అంతా చేశారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టాలని, ప్రజల మధ్య మత విభజన తీసుకురావాలని ఉగ్రవాదులు పథకం ప్రకారం ఈ దాడి చేశారు. దానికి ఊతమిచ్చేలా ఈ మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. పాకిస్తాన్‌పై యుద్ధం జరుగుతుందని, ఒక్క దెబ్బతో ఆ దేశం సర్వనాశనం అవుతుందని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటున్నామని, పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించనున్నామని ఇలా నోటికి, చేతికి అడ్డు అదుపు లేకుండా చెప్పారు, రాశారు. అమరావతి రెండవసారి శంకుస్థాపనకు వచ్చిన మోడీ నమో మిస్సైల్ అని ఒకరు, ఆయన మనసు నిండా పహల్గాం ఆవేదనతో ఉన్నారని మరొకరు పోటీ పడి కీర్తించారు. మరోవైపు, పవన్ కళ్యాణ్ విద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. అయితే మీడియాలోని కొన్ని సంస్థలు, సోషల్ మీడియాలోని కొందరు వ్యక్తులు వాస్తవ పరిస్థితులను తమ శక్తి మేరకు వినిపించే ప్రయత్నం చేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ యువత, ప్రజలు స్పందించిన వీడియోలు, బాధిత కుటుంబాల ప్రతిస్పందనలు వాస్తవ భారతీయతను ప్రతిబింబించాయి. దేశవ్యాప్తంగా ఐక్యంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి మృతులకు నివాళి అర్పించడంతో పాటు, ఉగ్రవాదాన్ని, దాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను తీవ్రంగా నిరసించారు. దశాబ్దాల తర్వాత కాశ్మీర్ ప్రజలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బంద్ పాటించారు. ఉన్మాదం ఎంత ప్రమాదకరమైనదో దేశం గుర్తించింది. మతోన్మాద రాజకీయాలకు ఇది హెచ్చరికగా మారింది.అమెరికా జోక్యంతో దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం మే 7 తెల్లవారుజామున 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ప్రాంతాల్లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడులు జరిగాయి. నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించి భారత ఆర్మీ తన శక్తి సామర్థ్యాలను చాటింది. దీనికి పాకిస్తాన్ ప్రతిదాడులు చేసింది. పాకిస్తాన్ అణ్వాయుధ దాడికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించడంతో మరింత ఉద్రిక్తత పెరిగింది. ఇలాంటి స్థితిలో అకస్మాత్తుగా మే 10న కాల్పులు విరమిస్తున్నట్లు భారత్, పాక్ ప్రకటించాయి. ఈ ఇరుదేశాలు ప్రకటించక ముందే 'అమెరికా మధ్యవర్తిత్వంతో రాత్రంతా జరిగిన చర్చలు, సంప్రదింపుల ఫలితంగా భారత్, పాకిస్తాన్‌లు తక్షణమే కాల్పుల విరమణకు అంగీకరించాయి' అని అమెరికా అధ్యక్షుడు 'ట్రంప్ ట్రూత్ సోషల్' అనే ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశాడు. ఆ తర్వాత మన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కాల్పుల విరమణను ప్రకటించడంతో పహల్గాం ఉగ్రవాదులను ఎక్కడున్నా శిక్షిస్తానన్న ప్రధాని వాగ్దానం నెరవేరకుండానే ఎందుకు విరమించారు? కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు ప్రకటించడమేమిటి? అనే ప్రశ్నల పరంపర పెరిగింది. మే 10న సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైజల్ బిన్ ఫర్హాన్ కూడా భారత్, పాక్ విదేశాంగ మంత్రులతో మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించినట్లు ప్రకటించాడు. ఇన్నేళ్ళుగా భారత్, పాకిస్తాన్ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వానికి అవకాశం లేకుండా అనుసరించిన మన విదేశాంగ విధానం సార్వభౌమత్వానికి ప్రతీకగా వుంది. స్వాతంత్ర్యానంతరం నుండి మన దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని సామ్రాజ్యవాద దేశాలు అనేక ఎత్తులు వేస్తూ వచ్చాయి. ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండానే మన స్వతంత్రతను కాపాడుకుంటూ వచ్చాము. అందుకు నాటి సోవియట్ రష్యా సహకారం కూడా ఒక కారణం. ఈ విధానం మన దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో పెంచింది. వాణిజ్య ప్రయోజనాల బెదిరింపుతో కాల్పులు విరమించారని, అమెరికా సరుకులపై భారతదేశం పన్నులు వేయకుండా అంగీకరించిందని వరుసబెట్టి అమెరికా అధ్యక్షుడు చేస్తున్న ప్రకటనలు మన సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. నిత్యం దేశభక్తి జపం చేసే పాలకులు ఇంతగా అమెరికాకు ఎందుకు సాగిలపడుతున్నారు? ఉగ్రవాదాన్ని అరికడతామని బయలుదేరి స్వతంత్ర విదేశాంగ విధానానికి ప్రమాదం తేవడమేమిటి? ఇంత జరుగుతున్నా ప్రధాని మాత్రం మౌనంగా వుండడం వెనుక రహస్యం ఏమిటి? విదేశాంగ శాఖ చేసిన ప్రకటన కంటి తుడుపు చర్యగా వుంది తప్ప, దేశ సార్వభౌమత్వం ప్రతిధ్వనించేలా లేదు. తన దేశ ఆర్థిక వ్యవస్థ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా ఆసియా ఖండంలో ఆధిపత్యం చెలాయించడానికి మన దేశాన్ని పావుగా వాడుకుంటున్నది. మోడీ ప్రభుత్వం అందుకు తోడ్పడుతున్నది.కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు అఖిలపక్ష సమావేశాలకు ప్రధాని హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల సమావేశానికి కేవలం బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను మాత్రమే పిలిచారు. పార్లమెంట్ సమావేశం జరిపి వాస్తవాలను ప్రజలకు చెప్పాలనే ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరించడంలేదు. మరోవైపు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి 'తిరంగా' యాత్రలను బిజెపి చేపట్టింది. యుద్ధ వార్తలను ఎప్పటికపుడు దేశానికి అందించిన కల్నల్ సోఫియా ఖురేషిపై బిజెపి అనుకూల సోషల్ మీడియాలో అసభ్యకరమైన ట్రోలింగ్ జరిగింది. జాతీయ మహిళా హక్కుల కమిషన్ జోక్యం చేసుకుని వారించిన తర్వాత, 'ఉగ్రవాదుల సోదరి'గా మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా అనుచిత వాఖ్యలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు కేసు నమోదు చేసినా, ఆయన చెప్పిన క్షమాపణలు మొసలి కన్నీరని ఘాటుగా వాఖ్యానించినా బిజెపి కేంద్ర నాయకత్వంలో చలనం లేదు. ఆయన మీద ఎలాంటి చర్యా లేదు. మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా సైన్యంపై అత్యంత అవమానకర వాఖ్యలు చేశారు. విదేశాంగ శాఖ కార్యదర్శి, సీనియర్ ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ అధికారి విక్రమ్ మిస్రి, అయన కుమార్తెపై చేసిన ట్రోలింగ్‌తో తన ట్విట్టర్ ఖాతానే రద్దు చేసుకున్నారు. ఇంత బరితెగించిన మూకపై ప్రధాని ఒక్క మాట మాట్లాడడంలేదు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చర్చలకు సిద్ధమంటున్న మావోయిస్టులను కాల్చి చంపుతున్నారు. దేశభక్తి, జై జవాన్, భారత మాతాకి జై అనే ఆర్‌ఎస్‌ఎస్ ఈ దుర్మార్గాలపై ఎందుకు మౌనంగా వుంది?కేంద్రానికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు వీటిని ఖండించకపోగా, బిజెపి 'తిరంగా' యాత్రను ప్రభుత్వ యాత్రగా మార్చి లౌకిక శక్తులను దూరం చేసుకుంటున్నాయి.

# విద్వేష రాజకీయాలకు 'నో' చెబుదాం....

ప్రస్తుతం మధ్యప్రదేశ్ బిజెపి ప్రభుత్వంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా క్యాబినెట్ హోదాలో ఉన్న సీనియర్ బిజెపి నాయకుడు విజరు షా మీడియాలో పతాక శీర్షికలకెక్కారు. అదేదో గొప్ప పని చేసినందుకు కాదు, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న కల్నల్ సోఫియా ఖురేషీ గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు. ఆ వ్యాఖ్యలపై దేశమంతటా దుమారం రేగింది. విజరుషా ను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేసి అతడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ కూడా వచ్చింది. చివరికి హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా స్పందించాయి. కాని బిజెపి ప్రభుత్వం మాత్రం విజరుషాను వెనకేసుకొస్తూనే వుంది. అంటే రాజ్యాంగ వ్యవస్థల్ని సైతం ధిక్కరించి తమ విద్వేష రాజకీయాలను ప్రచారం చేయడానికి తయారౌతున్నారు! రాజ్యాంగ బద్ధంగా నిర్వహించవలసిన పదవుల్ని సైతం దుర్వినియోగ పరుస్తున్నారు. ఈ విజరు షా ఈ విధంగా అసభ్యకర, విద్వేషపూరిత వ్యాఖ్యలు బహిరంగంగా చేయడం ఇదేమీ మొదటిసారి కాదు. బహుశా పత్రికల్లో తన పేరు రావాలంటే ఇటువంటి అసహ్యకరమైన పనులను మళ్ళీ మళ్ళీ చేయడమే మార్గం అని అతగాడు భావిస్తున్నట్టుంది. దాదాపు పదేళ్ళ క్రితం, విజరు షా రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్నాడు. అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భార్యపై ఒక బహిరంగ వేదిక పైనుండి అతడి సమక్షం లోనే అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశాడీ విజరు షా. దానిని ప్రజానీకం తీవ్రంగా విమర్శించింది. ఆ తర్వాత తాను అలాంటి వ్యాఖ్య చేసినందుకు "పది సార్లు" క్షమాపణ కోరినట్టు విజరు షా ప్రకటించుకున్నారు. చివరికి అతడు మంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఐతే నాలుగు నెలలు తిరగకుండానే అతడిని మళ్ళీ క్యాబినెట్ మంత్రిగా నియమించారు! 2020లో విజరు షా అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు "షేరిని" అనే హిందీ సినిమా చిత్రీకరణ బాల్‌ఘాట్ వద్ద జరుగుతున్నప్పుడు అందులో నటిస్తున్న విద్యా బాలన్‌ను డిన్నర్‌కు ఆహ్వానించాడు. ఆమె ఆ ఆహ్వానాన్ని తిరస్కరించింది. దాంతో ఆ సినిమా షూటింగ్ ని ఆపేయించాడీ షా. ఇంకొక సందర్భంలో రాట్లం అనేఊరులో ఒక స్కూలులో జరుగుతున్న కార్యక్రమానికి ఇతడిని ముఖ్య అతిథిగా పిలిచారు. ఆ కార్యక్రమంలో ఆడపిల్లలకు టి-షర్ట్ లను పంపిణీ చేస్తున్నారు. ఆ సందర్భంలో షా చాలా అనుచితమైన రీతిలో "వాళ్ళకి రెండేసి టి-షర్టులివ్వండి. వాళ్ళు లోదుస్తులేం వేసుకుంటారో ఎవరికి తెలుసు?" అంటూ వ్యాఖ్యానించాడు! అతడి అసభ్యకర వ్యాఖ్యలను చివరికి స్కూలు పిల్లలు కూడా లక్ష్యం అయ్యారు. 2018లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ఏవో నాలుగు మంచి




మాటలు చెప్పి పోకుండా, "ఇప్పుడు గనుక మీరు చప్పట్లు కొట్టకపోతే వచ్చే జన్మలో మీరు ఇంటింటికీ చప్పట్లు కొట్టుకుంటూ తిరిగే వారిగా పుడతారు" అంటూ మాట్లాడారు. ఉపాధ్యాయులను అవమానపరచడమే కాదు, ట్రాన్స్‌జెండర్లను కూడా అవహేళన చేసే విధంగా మాట్లాడారు. 2022లో ఒక ఉపన్యాసంలో రాహుల్ గాంధీ గురించి ప్రస్తావిస్తూ అతడు బ్రహ్మచారిగా ఉండడానికి కారణం అతడికి 'మగతనం' లేకపోవడమే అంటూ చాలా నీచంగా మాట్లాడాడు. ఇప్పుడు తాజాగా కల్నల్ ఖురేషీ గురించి మాట్లాడుతూ ఆమె పాకిస్తాన్‌లో ప్రవేశించి ఉగ్రవాదులను "బట్టలూడదీసి నిలబెట్టిందంటూ" మాట్లాడాడు. అతగాడి వ్యాఖ్యల్లో అంతర్లీనంగా పదే పదే వ్యక్తమైన 'సెక్సిస్ట్' ధోరణి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఐనప్పటికీ, అతడితోపాటు ఆ బహిరంగ వేదికపై ఉన్న బిజెపి ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి ఉషా ఠాకూర్‌కు మాత్రం అతడి మాటల్లో అభ్యంతరకరమైనవేవీ తోచినట్టు లేదు. ఆమె ఆ వ్యాఖ్యలకు స్టేజి పైనే పగలబడి నవ్వారు. ఇంతవరకూ పేర్కొన్న సందర్భాలను చూస్తే వాటిలో మదం, విద్వేషం, అధికార దుర్వినియోగం వ్యక్తం అవుతున్నాయి. ఇదొక ఆందోళనకరమైన ధోరణి. పదే పదే విజరు షా ఈ విధంగా వ్యవహరించడం, అతడి సిగ్గుమాలిన ధోరణిని అతడి పార్టీ ప్రశ్నించకపోవడం దీర్ఘ కాలంగా కొనసాగుతోంది. ఆర్మీ ఆఫీసర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పకుండా అందరూ ఖండించి తీరాల్సిందే. కాని అంతటితోటే ఆగిపోతే మనకు బిజెపిలో లోతుగా వేళ్ళూనుకుని వున్న మనువాద, మహిళా-వ్యతిరేక ధోరణి కనిపించదు. విజరు షా ఒక్కడిలోనే ఈ ధోరణి కనిపిస్తోందనుకోకూడదు. అతడు బిజెపి వాస్తవ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. అందుకే ఒక్క ఉమాభారతి తప్ప బిజెపి లోని ఏ ఇతర మహిళా నేతా అతడి వ్యాఖ్యలను ఖండించలేదు. నిజానికి ఉషా ఠాకూర్‌తో సహా చాలా మంది మహిళా నేతలు, మంత్రులు విజరు షా ను సమర్థిస్తూ మాట్లాడారు. వారికెవరికీ అతడి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా తోచలేదట! ఉమా భారతి కూడా సాటి మహిళ అయిన సోఫియా ఖురేషీపై వ్యాఖ్యానించినందుకు ఖండించలేదు. సైన్యం గురించి అలా వ్యాఖ్యానించడం తప్పు అని ఆమె భావించారు. ఆమెకున్న అతి జాతీయవాద ధోరణి ప్రకారం సైన్యం అన్ని ఇతర వ్యవస్థలకూ అతీతం. కనుక అటువంటి సైన్యం గురించి తప్పుగా, అవహేళనగా మాట్లాడడం అంటే దేశద్రోహం అవుతుంది. అందుకోసం ఆమె విజరు షా ను ఖండించవలసి వచ్చింది. మానభంగం కేసులో శిక్ష పడిన నేరస్తుడు ఆశారాం బాపు ను వెనకేసుకు వచ్చినవారిలో మొదటి వ్యక్తి ఉమాభారతి అన్న వాస్తవాన్ని మనం మరిచిపోకూడదు. మధ్యప్రదేశ్ బిజెపి శాఖలో మహిళల పరిస్థితి ఏమిటి? సాత్నా జిల్లా బిజెపి అధ్యక్షుడు తనకు అసభ్యకరంగా మెసేజ్‌లు పంపుతున్నాడంటూ ఒక మహిళా నేత ఆరోపించారు. పార్టీ ఆఫీసులో అడుగు పెట్టాలంటేనే భయంగా ఉందంటూ ఆమె వాపోయారు. సింగ్రౌలీ జిల్లా బిజెపి అధ్యక్షుడు బార్ డాన్సర్లతో అసభ్యకర నృత్యాలు చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది. మోహన్ యాదవ్ ముఖ్యమంత్రి అయిన కొద్ది రోజుల్లోనే అతడు తన ఎదురుగా ఉన్న వ్యక్తి తల్లినీ, అక్కచెల్లెళ్ళనీ ఉద్దేశించి బూతులు తిడుతున్న వీడియో ఒకటి, కాంగ్రెస్ వర్కర్ల చేత "ఆంబోతు పాలు" (ఆవు పాలు కాదు సుమా) తాగిస్తానంటూ సవాలు చేసిన వీడియో మరొకటి వెలుగులోకి వచ్చాయి. ఇదీ బిజెపి సంస్కృతి. తమది సాంస్కృతిక సంస్థ అని ప్రకటించుకునే ఆరెస్సెస్ నుంచి ఎటువంటి సంస్కృతి పుట్టుకొస్తోందో దీనిని బట్టి తేటతెల్లం ఔతోంది. అందుకే ప్రధానమంత్రితో సహా ఏ బిజెపి నాయకులూ విజరు షా వ్యాఖ్యలను ఖండించలేదు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి గాని, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడికి గాని ఆ వ్యాఖ్యల్లో అభ్యంతరకరమైనవేవీ కనిపించనేలేదు. ఆ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోనేలేదు. "మురికి గుంటల్లో దొర్లేవాడు" అంటూ హైకోర్టు అతడి గురించి అన్నది. అంతేకాక అటువంటి వ్యక్తులు సైన్యానికే గాక దేశ ఐక్యతకు, మత సామరస్యానికి ప్రమాదకారులు అని కూడా అన్నది. అతడిపై దేశద్రోహ నేరం కింద చార్జిషీటు దాఖలు చేయమని పోలీసులను ఆదేశించింది. అది కూడా నాలుగు గంటల్లోపుగా అది జరగాలని ఆ న్యాయమూర్తి ఆదేశించారు. చెప్పిన గడువు లోగా ఎఫ్ఐఆర్ దాఖలు కాకుంటే డిజిపి కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు పరిగణిస్తామని కూడా హెచ్చరించారు. అయినా సరే రాత్రి 11 గంటల తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదైంది. తీరా ఆ ఎఫ్ఐఆర్ లో ఎక్కడా వాస్తవ సంఘటనను పేర్కొననే లేదు. పైగా విజరు షా పేరు వచ్చిన ప్రతీసారీ దానికి ముందు శ్రీ అని చాలా గౌరవంగా సంబోధించారు. ఈ వైఖరి పట్ల కోర్టు తీవ్రంగా స్పందించింది. ఆ ఎఫ్ఐఆర్ రాసిన తీరు ముద్దాయిని వెనకేసుకు వచ్చేలా ఉందని, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తోందని కోర్టు మండిపడింది. సుప్రీంకోర్టు కూడా విజరుషా ను మందలించింది. ఉన్నత పదవుల్లో ఉన్నవారు తమ మాటల విలువ ఏమిటో తెలుసుకోవాలని చెప్పింది. ఇప్పుడు షా క్షమాపణ కోరడం కేవలం మొసలి కన్నీళ్ళేనని అన్నది. ఒక సిట్‌ను ఏర్పాటు చేసి మే 28 లోగా నివేదిక తనకు ఇవ్వాలని ఆదేశించింది. ఒక్క విజరు షా యే కాదు, బిజెపిలో ఎవరికీ భారత రాజ్యాంగం పట్ల గౌరవం ఇసుమంత కూడా లేదు. ఇక ప్రజాస్వామ్యం, లౌకికతత్వం గురించి చెప్పనక్కరలేదు. మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవదా ఆపరేషన్ సిందూర్ జయప్రదం అయినందుకు ఉత్సవం జరుపుతూ, "దేశం యావత్తూ మోడీ గారికి వంగి నమస్కరిస్తోంది" అని ప్రకటించారు. అక్కడితో ఆగకుండా "ఈ దేశమే కాదు, మొత్తం సైనిక దళాలు కూడా మోడీకి వంగి నమస్కరించాలి" అన్నారు. ప్రజాస్వామ్యంలో అందరూ ప్రజలకి వంగి నమస్కరించాలి. కాని బిజెపి పాలనలో మాత్రం ప్రజలే పాలకులకు వంగి నమస్కరించాలన్నమాట. భూస్వామ్య సమాజంలో రాజుకు ప్రజలందరూ సేవకులే అన్న భావన ఉండేది. బిజెపి లో పేరుకుపోయిన ఫ్యూడల్ భావజాలం జగదీష్ దేవదా ప్రకటనల్లో కనిపిస్తోంది. దేశమంతా విజరు షా, జగదీష్ దేవదా ల వ్యాఖ్యలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నా, సైనిక దళాలకు రాజ్యాంగబద్ధంగా అధిపతి అయిన రాష్ట్రపతికి మాత్రం కనీసం చీమ కుట్టినట్టు అయినా లేదు. మన రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఏవీ విజరు షా వ్యాఖ్యల మీద నోరు విప్పే సాహసం చేయలేదు. మళ్ళీ వీళ్ళందరూ సినీ, రాజకీయ జీవితాల్లో హీరోలట! ఇంతగా బరితెగిస్తున్న బిజెపి కి దేశ ప్రజానీకమే తగిన విధంగా బుద్ధి చెప్పాలి. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కోరుకునేవారు, మనువాదాన్ని భూస్థాపితం చేయగోరేవారు అందరూ నోళ్ళు విప్పాలి.

# బెడిసికొట్టిన మోడియా హడావుడి

భారతీయ మీడియా దాదాపు మోడీయా గా మారిపోయిందన్న విమర్శ చాలా కాలంగా ఉంది కూడా. కీలక అంశాల్లో సైతం వాస్తవాల పరిశీలన, లోతైన అధ్యయనం లేకుండా కేవలం కేంద్ర పాలక పక్షమైన బిజెపి, ఆర్ఎస్ఎస్ లు చేసే ప్రచారాన్ని మోత మోగించడం బడా మీడియాకు పరిపాటిగా మారింది. ప్రధానమంత్రి మోడీ పైన, ఆయన మంత్రివర్గ సహచరుల పైన, ఆయనకు సన్నిహితులైన కార్పొరేట్ అధినేతలపైన వచ్చే ఆరోపణలను ముక్తసరిగా ముగించటం బిజెపి వ్యతిరేక లౌకిక, ప్రాంతీయ పార్టీలకు సంబంధించిన ప్రతి అంశం భూతద్దంలో చెప్పడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో అన్ని వ్యవస్థలను అపహస్యం చేయడానికి కూడా బడా మీడియా వెనుకాడటం లేదు. కరోనా సమయంలో అయితే ఇది పరాకాష్టకు చేరింది. ప్రభుత్వానికి భజన చేసే మీడియాను నెత్తిన పెట్టుకోవడం ఒకటైతే విమర్శించే వారిని నిర్బంధాలపాలు చేయడం, నిషేధించడం, వేధింపులకు గురిచేయటం నిత్యకృత్యమైంది. న్యూస్ క్లిక్, వైర్ న్యూస్ లతో సహా అనేక ప్రాంతీయ మీడియాలు, నిర్భయంగా పని చేసే సంపాదకులు, జర్నలిస్టులు, రచయితలు, అధ్యాపకులు నిఘా నేత్రానికి అక్రమ కేసులకు గురికావాల్సి వచ్చింది. రాజీవ్ గాంధీ హయాంలో బోఫోర్స్ కుంభకోణం వంటిది వస్తే నెలల తరబడి కథనాలు ఇచ్చిన మీడియా అతని కంపెనీ%ొ%అక్రమ విద్యుత్ ఒప్పందాల గురించి, అమెరికా సంస్థలు, అధికార వ్యవస్థల వివరాలు బయటపెట్టిన కేసుల లోతుపాతుల్లోకి పోకుండా పైపై వార్తలతో సరిపెట్టింది. అదే ఆంధ్రప్రదేశ్‌కు వస్తే ఇక్కడి వైసిపి, టిడిపి పరస్పరం తిట్టుకోడానికి తప్ప అసలు సమస్య వివరాల్లోకి పోకపోవడం, బలపరిచే మీడియా కూడా అలాగే వ్యవహరించడం చూస్తున్నాం. దేశం, రాష్ట్రాలకు సంబంధించిన ఈ కథలన్నీ అలా ఉంచితే ఇటీవల జరిగిన టెర్రరిస్ట్ హత్యాకాండ, భారత పాకిస్తాన్ సాయుధ సంఘర్షణ, నేపథ్యంలో భారతీయ మీడియా మరీ దారుణంగా తయారైంది. కాల్పుల విరమణ తర్వాత దేశంలోనే కాక అంతర్జాతీయంగా కూడా దాని పాత్రపై వివరమైన అధ్యయనాలు జరుగుతున్నాయి. సంచలన కథనాలు వెలువడుతున్నాయి. యుద్ధం కోసం బులపాటంబాధ్యతా రాహిత్యంతో అవాస్తవాలను, అసత్యాలను ప్రచారంలో పెట్టిన తీరుకు ప్రపంచం విస్తుపోతున్నది. భస్మాసుర హస్తంలా ఇది చివరకు తనను సృష్టించిన నరేంద్ర మోడీ సర్కారుకే ఇరకాటంగా పరిణమించింది. మోడీకి ఈ మీడియానే అతి పెద్ద ప్రతికూలాంశంగా మారిందని అల్‌జజీర్ సమగ్ర కథనాలు, చర్చలు ప్రచారం చేసింది. న్యూయార్క్ టైమ్స్ ఈ విషయం పతాక శీర్షికతో ప్రచురించింది. దేశంలో కూడా వైర్ న్యూస్ వంటి వెబ్‌సైట్లు ఫోటోలు, కథనాలు ఇచ్చాయి. ఉద్రిక్తత తారాస్థాయికి చేరిన, యుద్ధ మేఘాలు అలుముకున్న, దాడులు జరుగుతున్న ఒక పూర్వ రంగంలో మీడియా ఎంత బాధ్యతా రహితంగా వ్యవహరించిందో తెలుసుకుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. కేవలం నాలుగు రోజుల పరాకాష్టల్లో సాగిన ఈ సాయుధ సంఘర్షణపై కథనాలు ఎలా నడిచాయో వాస్తవాలు ఏమిటో వెనక్కు తిరిగి చూసుకోవడం ఇప్పుడు అందరికీ సాధ్యమే. తెలుగుతో సహా ప్రాంతీయ మీడియా కూడా ఇదే వరవడిలో సాగింది కనుక ఎవరైనా ఈ అంశం స్వయంగా పరిశీలించవచ్చు. కాకపోతే జాతీయ మీడియాలో వచ్చిన వార్తలను తాము ప్రసారం చేశామని ప్రాంతీయ మీడియాలు సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ కోట్ల మంది ప్రజలు వీక్షించే ప్రాంతీయ మీడియా బాధ్యత కూడా తక్కువ కాదు. ఒక విధంగా సామాన్య ప్రజలను చేరేది అదే గనుక మరింత ఎక్కువ బాధ్యత కూడా ఉంటుంది. అసత్యాలపై రాజ్‌దీప్ క్షమాపణభారత్ పాకిస్తాన్ ఘర్షణపై మీడియా అనుసరించిన కథనాల శైలి బయటి దేశం మీదకాక స్వదేశం మీదనే దృష్టి పెట్టినట్లు సాగిందని విమర్శకుల విశ్లేషణ. అంటే దేశంలో వీక్షకులను సంచలన కథనాలతో ఆకట్టుకొని రేటింగ్ పెంచుకోవడం మతాలవారీ విద్వేషాలు పెంచి మైనార్టీలపై ద్వేషం రెచ్చగొట్టడం అనే రెండు లక్షణాలు ఇక్కడ కనిపిస్తాయి. సాధారణంగా సోషల్ మీడియానే ఇందుకు కారణమని చెప్పడం జరుగుతుంది. కానీ ఈ ఘర్షణ సమయంలో ప్రధాన మీడియా అన్నది కూడా ఇందుకు మినహాయింపు కాకపోవడం ఆందోళనకరం. ఆర్ణబ్ గోస్వామి రిపబ్లిక్ టీవీ వంటివి టీవీ స్టూడియోలను యుద్ధ రంగాలుగా మార్చేశాయి. తుపాకుల బొమ్మలు, ఆయుధాలు, చెట్లు నమూనాలతో మరింత ఉద్రిక్తతకు కారణమయ్యాయి. దాడులపై నిరాధారమైన కథనాలిచ్చాయి. ఇది ఎంతవరకు పోయింది? ఏ స్థాయిలో సాగింది? అంటే సీనియర్ సంపాదకుడైన రాజ్‌దీప్ సర్దేశారు ఆధారం లేని కొన్ని కథనాలు చెప్పినందుకు క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. ఆర్ణబ్ గోస్వామి అందుకు సిద్ధపడలేదు కానీ ఘోరంగా రెచ్చిపోయి వ్యవహరించారు. ఇక్కడ చెప్పుకోవాల్సింది ఏమంటే పాకిస్తాన్ మీడియా కూడా అందుకు ఏమాత్రం తీసిపోని విధంగా అసత్య కథనాలతో ఆవేశం పెంచడానికి పనిచేసింది. ఆ మీడియాని గనుక నమ్మినట్లయితే ఢిల్లీపై దాడి జరిగిందని భావించాల్సి వచ్చేది. ఆర్ణబ్ గోస్వామి కథనాల ప్రకారం 400 డ్రోన్లను భారత సైన్యం ఒక్క దెబ్బతో పేల్చివేసింది. పాకిస్తాన్‌లో సైనిక కుట్రే జరిగిపోయింది. దాడి కకావికలం చేసింది. ఐఎన్ఎస్ విక్రాంత్ బయల్దేరి కరాచీ రేవును ధ్వంసం చేసింది. ఇండియా న్యూస్ టీవీ కథనం ప్రకారం లాహోర్ ధ్వంసమైంది. ఎన్.డి టివి కథనం ప్రకారం ట్యాంకులు కూల్చివేయబడ్డాయి. 17 జె.ఎఫ్ విమానాలను, ఎఫ్ 16 విమానాలను పాకిస్తాన్ నుంచి భారత సైన్యం పట్టుకున్నదని ఇండియా టుడే కథనం ప్రసారం చేసింది. ఆజ్ తక్ చానల్‌లో అంజనా మిశ్రా, శ్వేతా కశ్యప్ ఆవేశపూరితమైన కథనాలు ఇవ్వటమే కాకుండా పాకిస్తాన్ సూసైడ్ దళాలు సైన్యంపై దాడికి కుట్ర పన్నాయని ప్రసారమైంది. ఎ.బి.పి, జీ న్యూస్ లు పాక్ సైనిక దళాల ప్రధాన అధికారి మునీర్‌ను తొలగించేసినట్టు ప్రసారం చేసింది. 450 మంది ప్రైవేట్ సైన్యం దాడి చేస్తున్నట్లుగా అజరు శర్మ కథనం ఇచ్చారు. ఉదాహరణలు చెప్పాలంటే స్థలాభావం అడ్డొస్తుంది. ఇలాంటి కథనాలతో రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రజలు చాలా ఆందోళన చెందారని కూడా తర్వాత బయటకు వచ్చింది. ఈ వివరాలన్నింటి నిజానిజాలను ఆల్ట్ న్యూస్, క్వింట్ వంటివి బయటపెట్టాయి. పంజాబ్ కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ శర్మ ఈ అసత్య కథనాల సుదీర్ఘ జాబితాను తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు

# కల్పిత ఏకాభిప్రాయ ప్రహసనం....

కారణం ఆయనకే బాగా తెలియాలి కానీ ప్రధాని నరేంద్ర మోడీ పహల్గాంలోని బైసరన్ లోయలో సాగిన అమానుష హత్యాకాండపై పార్లమెంట్‌లో జరిగిన రెండు అఖిలపక్ష సమావేశాలకూ హాజరు కావద్దని నిర్ణయించుకున్నారు. దీనిపై భారతదేశం స్పందన ఎలా వుండాలో చర్చించేందుకు జరిగిన ఆ సమావేశాలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఐక్యరాజ్యసమితి టెర్రరిస్టు సంస్థగా నిర్ధారించిన లష్కరే తోయిబాతో ముడిపడిన టెర్రరిస్ట్‌లు సాగించిన హత్యలను వారు నిష్కర్షగా ఖండించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే సరైన ప్రతిచర్యలకు తమ మద్దతు ప్రకటించారు. కాల్పుల విరమణ ప్రకటన దాకా ఈ ఏకాభిప్రాయం చెక్కు చెదరకుండా వుంది. మిలిటరీ చర్య ముగిసే వరకూ ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తకుండా సంయమనం పాటించాయి. అయితే తాను, తమ ప్రభుత్వం కాల్పుల విరమణకు దోహదం చేశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించారు. వాణిజ్యపరమైన పర్యవసానాలు వుంటాయిని తాను హెచ్చరించాకనే భారత్-పాక్ దేశాలు ఒత్తిడికి దిగివచ్చాయని చెప్పారు. ఇది ఆశ్చర్యకరమేగాక సిమ్లా ఒప్పంద స్ఫూర్తిని ఉల్లంఘించేది కూడా. సంప్రదింపులతో పరిష్కారం కోసం ప్రయత్నాలు సాగిన ఫలితంగా కుదిరిన ఒప్పందం అది. రెండు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే అన్ని వివాదాలు పరిష్కరించుకోవడానికి కట్టుబడేలా చేసింది. అయినాసరే కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయ సమస్యగా మార్చేందుకు పాకిస్తాన్ నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ చెప్పింది పూర్తిగా యథాతథంగా తీసుకునేట్టయితే దాని ప్రకారం అది అంతర్జాతీయీకరించబడింది. దీనివల్ల వ్యూహాత్మకంగానూ దౌత్యపరంగానూ తీవ్ర పర్యవసానాలు తప్పవు. భారతీయ అధికారులు, ప్రభుత్వం కూడా ద్వైపాక్షిక చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ జరిగిందని ప్రకటిస్తున్నా చెప్పుకోదగిన గందరగోళం ఏర్పడింది. ఈ ప్రకటనల విశ్వసనీయతపై నిజంగానే అనుమానాలు నెలకొన్నాయి. ఈ ప్రధాన సమస్యతోపాటు అధికారిక వివరణ రావాల్సిన ఇతర విషయాలు కూడా వున్నాయి. ఇవి ముఖ్యంగా సైనిక చర్య చుట్టూ అల్లుకుని వున్నాయి. ప్రధాన మీడియా విద్రూరమైన నిరాధార కథనాలు ప్రచారం చేసిన ఫలితంగా ఇది మరింత అవసరంగా మారింది. వీటిలో కొన్ని వార్తా కథనాలు, మరీ ముఖ్యంగా మే 8 రాత్రి ప్రసారమైనవి ఎంత దారుణంగా నడిచాయంటే భారతీయ మీడియాను అంతర్జాతీయ సమాజం దోషిగా ఈసడించే పరిస్థితి. ఈ అవాస్తవ చిత్రీకరణలు అంతిమంగా దేశ ప్రయోజనాలకే చేటుగా పరిణమించాయి. అందువల్లనే కాల్పుల విరమణ తరువాత పార్లమెంటులో ప్రభుత్వ సాధికార ప్రకటన తప్పనిసరి అవసరంగా తయారైంది. ఐ.ఎం.ఎఫ్ యాజమాన్యం ఏ అభ్యంతరాలు లేకుండా పాకిస్తాన్‌కు లక్ష కోట్ల డాలర్ల రుణం మంజూరు చేసినప్పుడు%ొ%స్పష్టంగా మన దౌత్యపర వైఫల్యం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం సాధికారికంగా చేసే ప్రకటన, దానిపై సభలో క్రమబద్ధమైన చర్చను అనుమతించడం ద్వారా దేశంలో నిజమైన ఒక ఏకాభిప్రాయం రూపొందేది. అలాంటి ప్రక్రియ వల్ల పారదర్శకత వచ్చేది. రాజకీయ క్షేత్రంలో వివిధ రకాలుగా అల్లుకునిపోయిన భిన్న, బహుళ దృక్పథాలను సమ్మిళితం చేయడం సాధ్యమయ్యేది. జాతీయ ఏకాభిప్రాయం అనేది బలవంతంగా రుద్దిందో లేక కృత్రిమంగా వండిందో కాక నిజమైన రూపంలో ముందుకొచ్చేది. ఈ రూపకల్పనలో భిన్న దృక్పథాలు వ్యక్తం చేసే అవకాశముండటం ఒక కీలకమైన అంశం. అయినా సరే ప్రభుత్వం ప్రత్యేక సమావేశం జరపాలన్న కోర్కెకు సానుకూలంగా స్పందించడానికి నిరాకరించింది. కారణాలు వారికే బాగా తెలియాలి. అందుకు బదులుగా టెర్రరిజంను, దాని వెనక వున్న వారిని ఖండించడంలో రాజకీయ పార్టీలు చూపిన ఏకాభిప్రాయం విశాల జాతీయ ఏకాభిప్రాయంగా ప్రచారం చేసుకోవచ్చని భావించింది. సైనిక చర్య సందర్భంలో




భారతీయులు తమ ప్రభుత్వాన్ని తామే విమర్శించారని ఒక పాకిస్తాన్ విలేకరి అడిగితే విదేశాంగ శాఖ కార్యదర్శి సరిగ్గానే స్పందించారు. భారత దేశంలో సజీవమైన ప్రజాస్వామ్యం వుంది గనక ప్రభుత్వం ప్రజలకు జవాబుదారుగా వుంటుందన్నారు. నిజంగానే భారత రాజ్యాంగం దాని లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర లక్షణాలు దేశ విదేశీ సవాళ్ళను ఎదుర్కోవడంలో మన ప్రధాన శక్తిగా వున్నాయి. ఇది దేశం తనను తాను సందర్శించుకునే సమయం. సముచితమైన పారదర్శకమైన ప్రజాస్వామిక చర్చతో ఒక నిజమైన జాతీయ ఏకాభిప్రాయం రూపొందించుకోవడంలో నిమగం కావలసిన మరో సందర్భం. దాన్ని కృత్రిమంగా తయారు చేయడం కుదరదు. ఈ పూర్వ రంగంలో ప్రభుత్వం రాజకీయ ఐక్యతను దౌత్యపరమైన చొరవకు పెంచుకునే సాధనంగా చూపించుకోవడానికి ప్రయత్నాలు చేసింది. అయితే సరైన జాతీయ ఏకాభిప్రాయం పునాదిగా లేకపోతే ఈ దౌత్యపరమైన అనుకూలత స్థిరంగా నిలబడజాలదు. అయినా భారత దేశపు నికరమైన, నిలకడైన బలం దాని రాజ్యాంగ మౌలిక విలువలలో వుంది. సీమాంతర ఉగ్రవాద సవాలును ఎదుర్కొవడానికి ఈ విలువలనే ద్విగుణీకత శక్తితో ముందుకు తీసుకుపోవాలి.